సాక్షి నిజామాబాద్

శనివారం । 25 । మార్చి । 2023



కల్లు కాదు గరళం..

జిల్లాలో కల్తీ కల్లు జోరుగా విక్రయిస్తున్నారు. మత్తు పదార్థాలను విపరీతంగా వాడటంతో ప్రజలు ఈ కల్లుకు బానిసవుతున్నారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
35.4 /22.1

వాతావరణం

ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం వాతావరణం చల్లబడుతుంది. రాత్రి చల్లటి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కేంద్రానిది ప్రజావ్యతిరేక పాలన



ఖలీల్‌వాడి : కేంద్రంలో మోడీ సర్కారు ప్రజా వ్యతిరేక పాలన అవలంభిస్తోందని సీపీఐ (ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు విజయరాఘవన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జనచైతన్య యాత్ర, బైక్ ర్యాలీని ప్రారంభించిన అనంతరం ధర్నాచౌక్ వద్ద సభ నిర్వహించారు. ఉపాధి హామీలో పనిదినాలు తగ్గించారన్నారు. తెలంగాణలో గవర్నర్ పలు బిల్లులపై సంతకాలు చేయకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. కేరళలో కేంద్రం తీసుకొచ్చిన ప్రజావ్యతిరేక చట్టాలను అమలు చేయట్లేదని, పింఛన్ రూ. 3,200 ఇస్తున్నామని, పేదలకు 20 కిలోల బియ్యం ఇస్తున్నామన్నారు. ఈడీ, సీబీఐ, కస్టమ్స్ తదితర దర్యాప్తు సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వాలను వేధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్వెస్లీ, చుక్క రాములు, సాగర్, ఎస్వీ రమ, రమణ, రమేశ్‌బాబు, అరుణజ్యోతి, సుర్జహాన్, సబ్బ నిలత, పెద్ది వెంకట్రాములు పాల్గొన్నారు.

'పోడు' పాస్ పుస్తకాలు క్షుణ్ణంగా పరిశీలించాలి



సుభాష్‌నగర్ : పోడు భూములకు సంబంధించి జిల్లాస్థాయి కమిటీలో ఆమోదం పొందిన క్లెయిమ్‌ల ప్రకారం రూపొందించిన పట్టా పాస్ పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. ప్రభుత్వం ఆదేశాలిచ్చిన వెంటనే అర్హులైన వారికి ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలను అందించేందుకు వీలుగా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్‌లో ఆర్‌ఓఎఫ్‌ఆర్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం ఏర్పాటుచేశారు. పోడు భూములకు ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అనే విషయాలను చర్చించారు. పంచాయతీల వారీగా పాస్ పుస్తకాలను పరిశీలించాలని, తప్పులుంటే తమ దృష్టికి తేవాలన్నారు. శనివారంలోపు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి చంద్రశేఖర్, డీఎఫ్‌ఓ వికాస్ మీనా, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి నాగూరావు, ఆర్డీఓలు రాజేశ్వర్, శ్రీనివాస్, అటవీ శాఖ అధికారులు, కమిటీ సభ్యులైన భీంగల్, మోపాల్, సిరికొండ జెడ్పీటీసీలు రవి, కమల బానోత్, మాలావత్ మాన్‌సింగ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెంచాలి

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని నాగారం 300 క్వార్టర్స్‌లోని జీపీఎస్ జెండా గల్లీ పాఠశాలను శుక్రవారం డీఈవో దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. మన బస్తీ – మన బడి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. పాఠశాలకు అదనపు గదుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. హెచ్‌ఎం రామచందర్ గైక్వాడ్, ఉపాధ్యాయులు నరేష్, కవిత, శ్రీనివాస్, శైలజ పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనలో జిల్లాకు బంగారు పతకం



నిజామాబాద్ సిటీ: క్షయ నిర్మూలనకు కృషి చేసినందుకు నిజామాబాద్ జిల్లాకు జాతీయ స్థాయిలో బంగారు పతకం లభించింది. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వారణాసిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం సుదర్శనం, రాష్ట్ర టీబీ జాయింట్ డైరెక్టర్ రాజేశం చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్నారు. ఈ పతకాన్ని ప్రధాని మోదీ చేతుల మీదుగా అందుకోవల్సి ఉన్నా.. ఆయన కొద్దిమందికే ఇచ్చి వెళ్లిపోయారు. దీంతో డీఎంహెచ్‌వో సుదర్శనం, టీబీ జిల్లా సమన్వయకర్త రవిగౌడ్ జేడీ రాజేశం చేతుల మీదుగా బంగారు పతకం స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో సాక్షితో మాట్లాడుతూ క్షయ వ్యాధి నియంత్రణలో జిల్లాకు బంగారు పతకం రావటం సంతోషంగా ఉందన్నారు. వరుసగా మూడు సంవత్సరాల నుంచి జాతీయస్థాయిలో అవార్డులు వచ్చాయన్నారు.

ఈ ఏడాది ఇచ్చింది 642 మాత్రమే

- జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ తీరిది..
- ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్‌లో పంపిణీ నిల్
- ఆర్మూర్ నియోజకవర్గంలో ఒక్క ఇల్లు నిర్మాణం కాని దుస్థితి
- జిల్లాలో 15,195 ఇళ్లకు గాను కట్టింది 4,398 మాత్రమే..
- మొత్తంగా లబ్ధిదారులకు పంపిణీ చేసింది కేవలం 2,269 ఇళ్లు

ఈ ఏడాది సంక్రాంతి తర్వాత డబుల్ బెడ్‌రూం ఇళ్లు వెంటవెంటనే పంపిణీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ జిల్లాలో ఇది సక్రమంగా అమలు కావడం లేదు. మంజూరైన వాటిలో నిర్మాణం పూర్తిచేసుకున్నవి కొన్నే అయినప్పటికీ, చివరకు ఎమ్మెల్యేలు పట్టింపు లేకుండా వ్యవహరిస్తుండడంతో సదరు నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లు కూడా పంపిణీకి నోచుకోవడంలేదు.



నాగారంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ధ్వంసమైన స్విచ్ బోర్డులు



నాగారంలో నిర్మాణం పూర్తయి వృథాగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సంక్రాంతి తర్వాత జిల్లాలో ఇప్పటివరకు డబుల్ ఇళ్లు కేవలం 642 మాత్రమే పంపిణీ చేశారు. ఇందులో అత్యధికం బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని మండలాల్లోనే ఉన్నాయి. వర్ని, రుద్రూర్, కోటగిరి, పోతంగల్, మోస్రా, చందూర్ మండలాల్లో కలిపి సంక్రాంతి తర్వాత 400 ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బాల్కొండ నియోజకవర్గంలోని బడాభీమ్‌గల్‌లో, బోధన్ నియోజకవర్గంలోని సాలూరలో, నవీపేట మండలంలోని పోతంగల్‌లో, జన్నేపల్లిలో మాత్రమే పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా ఆర్మూర్, అర్బన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో ఒక్క ఇల్లు కూడా పంపిణీ చేయ లేదు. ఆర్మూర్ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఒక్క ఇల్లు కూడా నిర్మాణం పూర్తి చేసుకోకపోవడం గమనార్హం.

బాన్సువాడలో జెట్‌స్పీడ్‌తో..

అయితే బాన్సువాడ నియోజకవర్గం మొత్తంలో ఇప్పటివరకు 11వేలకు పైగా ఇళ్లు మంజూరు కాగా వీటిలో ఇప్పటివరకు మొత్తం 8,300 వరకు పంపిణీ చేయడం గమనార్హం. స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి పకడ్బందీ ప్లాన్‌తో డబుల్ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తుండడం విశేషం. ఇక నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 98 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా 50 ఇళ్లు పంపిణీ చేశారు. సంక్రాంతి తర్వాత ఒక్కటి కూడా పంపిణీ చేయలేదు. బాల్కొండ నియోజకవర్గంలో 320 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, వీటిలో 189 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు. గతంలో 77 ఇళ్లు ఇవ్వగా, గత సంక్రాంతి తర్వాత 112 ఇళ్లు లబ్ధిదారులకు ఇచ్చారు. కాగా నిజామాబాద్ జిల్లాలో సుమారు 1 లక్షకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. మొత్తంగా బాన్సువాడ నియోజకవర్గాన్ని మినహాయిస్తే డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ జిల్లాలో నామమాత్రంగానే ఉంది. దీంతో లబ్ధిదారులు వేయి కళ్లతో డబుల్ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారు.

సంక్రాంతి తర్వాత ఇచ్చిన ఇళ్ల వివరాలు

వర్ని, రుద్రూర్, కోటగిరి, పోతంగల్, మోస్రా, చందూర్	400
బడా భీమ్‌గల్	112
సాలూర	40
పోతంగల్	50
జన్నేపల్లి	40
మొత్తం	642

చిత్త శుద్ధి లేకపాయే..

జిల్లాలో గతంలో మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం అమలు విషయంలో చిత్తశుద్ధి కొంచమైనా లేకుండా పోయింది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాకు మొత్తం 15,195 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయి. అయితే ఇప్పటివరకు వీటిలో 12,751 ఇళ్లకు టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది. మరో 3,763 ఇళ్ల పనులు ప్రారంభమే కాలేదు. కేవలం 4,398 ఇళ్లు నిర్మాణం పూర్తయ్యాయి. వీటిలో 2,269 ఇళ్లు మాత్రమే లబ్ధిదారులకు అందించారు. అలాగే బోధన్ నియోజకవర్గంలో 652 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా గత సంక్రాంతి తర్వాత మాత్రమే 130 ఇళ్లు పంపిణీ చేశారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో 540 ఇళ్ల నిర్మాణం పూర్తికాగా ఇప్పటివరకు ఒక్క ఇల్లు కూడా లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. నగరం శివారులోని నాగారంలో నిర్మించిన డబుల్ ఇళ్లు కట్టి లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరాయి. వీటి అద్దాలు పగులగొట్టగా, వీటిల్లోని ఎలక్ట్రిక్, శానిటరీ సామాన్లు మొత్తం చోరీకి గురయ్యాయి. పైగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. కాగా బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని రుద్రూర్, వర్ని, కోటగిరి, పోతంగల్, చందూర్, మోస్రా మండలాల్లో 2,146 ఇళ్లు నిర్మాణం పూర్తి కాగా వీటిలో ఇప్పటివరకు 2,000 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు. గత సంక్రాంతి తర్వాత నుంచి మరో 400 ఇళ్లను లబ్ధిదారులకు అందించారు. మిగిలినవి నిర్మాణం తుది దశకు చేరుకున్నాయి.

గంటపాటు నిలిచిన పీజీ పరీక్ష

- ఎకనామిక్స్ పేపర్‌లో తలెత్తిన సమస్య
- తెయూలో ప్రారంభమైన సెమిస్టర్ పరీక్షలు



గిరిరాజ్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తెయూ కంట్రోలర్ అరుణ

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో శుక్రవారం పీజీ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అయితే మూడవ సెమిస్టర్ ఎకనామిక్స్ విద్యార్థులకు నాల్గో సెమిస్టర్ సిలబస్‌కు సంబంధించిన ప్రశ్నాపత్రం అందజేశారు. పేపర్ చూసి కంగుతిన్న విద్యార్థులు ఆయా పరీక్షా కేంద్రాల్లో అబ్జర్వర్ల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. వారు వెంటనే వర్సిటీ పరీక్షల విభాగం అధికారులకు సమాచారమివ్వగా వారు జరిగిన పొరపాటును గ్రహించిన ప్రశ్నాపత్రం మార్చి తిరిగి కొత్త పేపర్‌ను ఆయా పరీక్షా కేంద్రాలకు పంపారు. సుమారు గంటపాటు పరీక్ష నిలిచిపోవడంతో ఎకనామిక్స్ విద్యార్థులకు అదనపు సమయం ఇవ్వడంతో పరీక్ష సజావుగా పూర్తయింది.

ఉదయం జరిగిన పీజీ 3వ, 9వ సెమిస్టర్ పరీక్షల్లో 1,585 మంది విద్యార్థులకు గానూ 1,475 మంది హాజరయ్యారని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ తెలిపారు. క్యాంపస్ ఆర్ట్స్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్ధిని సందర్శించి పరీక్షల తీరును పరిశీలించారు. మధ్యాహ్నం జరిగిన పీజీ మొదటి, 5వ, 7వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో 1767 మంది విద్యార్థులకు గానూ 1,628 మంది హాజరయ్యారన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిరాజ్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని కంట్రోలర్ అరుణ సందర్శించారు.

ఘనంగా సాక్షి వార్షికోత్సవం



డిచ్‌పల్లి మండలం గాంధీనగర్ 'సాక్షి' యూనిట్ కార్యాలయంలో శుక్రవారం 'సాక్షి' దినపత్రిక 15వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సాక్షి యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు. – డిచ్‌పల్లి

నేటి నుంచి మాధవనగర్ గేట్ బంద్

- వాహనాలకు అనుమతి లేదని ఫ్లెక్సీల ప్రదర్శన
- మోపాల్, కంజర్ మీదుగా వెళ్లాలని అధికారుల సూచన
- కంఠేశ్వర్ బైపాస్ మీదుగా కూడా వెళ్లవచ్చంటున్న అధికారులు



మాధవనగర్ రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ జాం

ఖలీల్‌వాడి : నగరంలోని మాధవనగర్ రోడ్డును నేటి నుంచి పూర్తిగా మూసివేయనున్నారు. మాధవనగర్ ఆలయం సమీపంలో రైల్వేట్రాక్ వద్ద కొనసాగుతున్న ఆర్వోబీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అ సందర్భంగా బోర్గాం(పి) వద్ద ఈ దారిని మూసివేస్తున్నట్లుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. బారికేడ్లు ఏర్పాటు ట్రాఫిక్ పోలీస్‌ను నియమించి వాహనదారులను డైవర్షన్ చేస్తున్నారు. ఆర్వోబీ పిల్లర్ పనులు కొనసాగుతుండడంతో కొన్నిరోజుల క్రితం నుంచి భారీ వాహనాలకు అనుమతి ఇవ్వలేదు. ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలు కంఠేశ్వర్ బైపాస్ గుండా హైదరాబాద్ వెళ్లేవి. నేటి నుంచి మాత్రం మధవనగర్ దారిని పూర్తిగా మూసివేయనున్నారు. అన్ని వాహనాలను పూర్తిగా డైవర్షన్ చేయనున్నారు. బోర్గాం(పి) చౌరస్తా నుంచి మోపాల్, కంజర్, ముల్లంగి, డిచ్‌పల్లి మీదుగా హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉంటుంది. లేదా కంఠేశ్వర్ బైపాస్ మీదుగా హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. శుక్రవారం మధ్యాహ్నం మాధవనగర్ సాయిబాబా దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన పిల్లర్ వద్ద పనుల్లో భాగంగా మట్టికుప్పలు వేశారు. దీంతో భారీ ఎత్తున ట్రాఫిక్‌జాం ఏర్పడింది. అనంతరం ఆ మట్టి కుప్పలను తొలగించారు. పనుల్లో భాగంగా తాత్కాలికంగా రహదారిని మూసివేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులు రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం.



రూట్ మార్చినట్లుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

3 నుంచి బీఈడీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు



తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని అనుబంధ బీఈడీ కళాశాలల విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని, పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్ www. telanganauniversity. ac.in ను సంప్రదించాలని ఆమె సూచించారు.

రాహుల్‌పై అనర్హత.. కక్షసాధింపు చర్యే

- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

ఖలీల్‌వాడి : రాహుల్‌గాంధీపై అనర్హత వేటు కక్షసాధింపు చర్యేనని డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్షను సూరత్ కోర్టు విధిస్తే ఆ తీర్పు కాపీ అందిందో లేదో.. అంతలోనే లోక్‌సభ సెక్రటేరియట్ అనర్హత వేటు వేయడం సరైనది కాదన్నారు. సూరత్ కోర్టు తీర్పుపై అప్పీల్‌కు వెళ్లేందుకు నెల రోజుల సమయం ఉన్నా లోక్ సభ సెక్రటేరియట్ కనీసం రాహుల్ గాంధీకి ఒక్కరోజు సమ యం కూడా ఇవ్వలేదన్నారు. కనీసం నోటీసులు, స మాచారం అందించకుండా రాహుల్‌పై అనర్హత వేటు వేసేందుకు అత్యుత్సాహమేనన్నారు. రాహుల్‌గాంధీకి వస్తోన్న ఆదరణ చూసి మోడీకి భయం పట్టుకుందని, రాహు ల్ ప్రజల మధ్య ఉంటే రాజకీయంగా పప్పులు ఉడకవని మోడీకి అర్థమైందన్నారు. భారత్‌జోడో యాత్రతో దేశంలో కాంగ్రెస్ అనుకూల వాతావరణం కనిపిస్తూ ఉండటంతో రాహుల్‌గాంధీపై అక్కసుతో ఆయనపై అనర్హత వేటు వేశారని దుయ్యబట్టారు.



మానాల మోహన్‌రెడ్డి

తెలంగాణ పోలీసింగ్ దేశంలోనే ఆదర్శం

- శాంతి భద్రతలతోనే రాష్ట్రంలో పెట్టుబడులు
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- నిజామాబాద్‌లో కమాండ్ కంట్రోల్ భవనం ప్రారంభం
- గ్రామాల్లోని సీసీ కెమెరాలు అనుసంధానం చేయాలని ఆదేశం



మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

ఖలీల్‌వాడి: తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశంలోనే ఆదర్శమని, రాష్ట్రంలో పెట్టుబడులు రావడానికి శాంతిభద్రతలే కారణమని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమాండ్ కంట్రోల్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. కమాండ్ కంట్రోల్ రూంలోని సీపీ కాన్ఫరెన్స్ హాల్, సీడీఆర్ అనాలిసిస్, ఐటీ విభాగాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. కమాండ్ కంట్రోల్ జీవో లేకున్నా పోలీసులు ఏర్పాటు చేసుకున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ఇలాంటి కమాండ్ కంట్రోల్ భవనాలు ఎక్కడ లేవన్నారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఉంటే పెట్టుబడులు వస్తాయన్నారు. తెలంగాణలో ఇప్పటి వరకు రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 16 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించిందన్నారు. సీపీ కెఆర్ నాగరాజు సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి అన్నారు. సీపీ నాగరాజు త్వరలోనే విరమణ చేయనున్నారని, పొడిగించేందుకు అవకాశం లేదని, ఆయనకు మరేదైనా అవకాశం కల్పిస్తామన్నారు. జిల్లాలో గంజాయి లేకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. గ్రామాల్లో ఉన్న సీసీ కెమెరాలను వారంలో పోలీస్ కమాండ్ కంట్రోల్ భవనానికి అనుసంధానం చేయాలన్నారు. గంజాయి విషయంలో తన అనుచరులొచ్చినా పట్టించుకోకుండా కేసులు పెట్టాలన్నారు.

హైదరాబాద్ తరహాలో..

హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ కమాండ్ కంట్రోల్ భవనం తరహాలో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు సీపీ నాగరాజు తెలిపారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి రూ.40 లక్షలు, ఎమ్మెల్సీ రూ.20 లక్షలు, కలెక్టర్ రూ.15 లక్షల నిధులతోపాటు పోలీసుల సహకారంతో కమాండ్ కంట్రోల్ భవనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గంజాయిని రూపుమాపడానికి చర్యలు చేపట్టామని ఇప్పటివరకు 15 కేసులు నమోదు చేశామన్నారు. 300 మంది కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. పండుగల సందర్భంగా ఎలాంటి కమ్యూనల్ ఇబ్బందులు రాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాలతో ఇప్పటి వరకు మూడు మర్డర్ కేసులను ఛేదించామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ నీతూకిరణ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నూడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్ నర్సుబాయి, ఏసీపీలు కిరణ్‌కుమార్, నారాయణ, సంతోష్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.



కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

అగ్ని ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలి

- పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించిన సీఎస్ శాంతి కుమారి
- ఏర్పాట్లు చేశామన్న కలెక్టర్ హనుమంతు

సుభాష్‌నగర్ : వేసవి సీజన్‌లో అగ్ని ప్రమాద ఘటనలకు ఆస్కారం లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి సూచించారు. ప్రభుత్వం అమల్జేస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమం, కంటి వెలుగు శిబిరాలను విరివిగా సందర్శిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో ద్వారా జిల్లా కలెక్టర్లతో వివిధ అంశాలపై సీఎస్ సమీక్షించారు. డబుల్ బెడ్‌రూమ్ పథకంతో పాటు కంటివెలుగు, ఆరోగ్య మహిళా, టెన్త్, ఇంటర్, డిగ్రీ వార్షిక పరీక్షల నిర్వహణ, పోడు భూములకు పట్టాల పంపిణీ, జీవో. నెం 58, 59, 76, 118 అమలు, తెలంగాణకు హరితహారం, కొత్త కలెక్టరేట్‌లోకి అన్ని ప్రభుత్వశాఖలు చేరడం, తదితర అంశాల ప్రగతిని సమీక్షిస్తూ కీలక సూచనలు చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అగ్ని ప్రమాద సంఘటనలను సీఎస్ ఉటంకిస్తూ అలాంటివి జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆరోగ్య మహిళ, కంటి వెలుగు కార్యక్రమాలకు అనూహ్య స్పందన లభిస్తోందని, రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేసి వివరాలు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలన్నారు. జిల్లాల్లో అన్ని ప్రభుత్వ శాఖలు కొత్త కలెక్టరేట్‌లోకి వచ్చేయాలని ఏప్రిల్ నుంచి వాటికి అద్దె నిలిపేస్తామన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ కొత్త కలెక్టరేట్‌లోకి కేవలం పశుసంవర్ధక శాఖ తప్ప అన్ని శాఖల కార్యాలయాలు వచ్చేశాయని, ఆ శాఖ కూడా సోమవారం కొత్త కలెక్టరేట్‌లోకి వచ్చేస్తుందన్నారు. వార్షిక పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖలతో సమీక్ష నిర్వహించి స్పష్టమైన సూచనలు చేశామన్నారు. ఇంటర్ పరీక్షలు సజావుగా సాగుతున్నాయని, అదే తరహాలో పది, డిగ్రీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. వీసీలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, జిల్లా అటవీశాఖ అధికారి వికాస్ మీనా, కలెక్టరేట్ ఏఓ ప్రశాంత్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

క్లుప్తంగా

మున్సిపాలిటీ టెక్నికల్ ఆఫీసర్‌పై ఫిర్యాదు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని మున్సిపాలిటీలలో సాఫ్ట్‌వేర్ టెక్నికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న దేశ్‌ముఖ్‌పై శుక్రవారం రెవెన్యూ అధికారులు మున్సిపల్ కమిషనర్ చిత్రామిశ్రాకు ఫిర్యాదు చేశారు. నగరంలోని ఎల్లమ్మగుట్ట కాలనీలో ఓ ఇంటికి అక్రమంగా రూ.25వేల ఇంటి ట్యాక్సీ కట్టకున్నా.. కట్టిన్నట్లు రశీదు ఇవ్వడానికి ప్రయత్నించారు. ఇదే విషయమై చెల్లింపులో తేడా రావడంతో రెవెన్యూ అధికారులు ఆరా తీశారు. ఏం జరిగిందో తెలుసుకొని విచారించగా గ్లోబత్ కంపెనీ నుంచి జిల్లాలో ఉన్న మున్సిపాలిటీలో సాఫ్ట్‌వేర్ సమస్య తలెత్తితే, సమస్య పరిష్కరించే ఉద్యోగి దేశ్‌ముఖ్ అక్రమాలకు పాల్పడే ప్రయత్నం చేశాడన్నారు.

బాల్య వివాహం అడ్డగింత

బోధన్‌రూరల్: మండలంలోని పెంటాకుర్దులో శుక్రవారం బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. గ్రామంలో 12ఏళ్ల బాలికకు వివాహం చేస్తున్నట్లు ఐసీడీఎస్ చైల్డ్ లైన్ 1098కు సమాచారం అందగా.. అధికారులు గ్రామానికి చేరుకొని వివాహన్ని నిలిపివేశారు. అనంతరం బాలిక కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ అందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఖలీల్‌వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఆశ నారాయణ, ప్రధాన కార్యదర్శిగా భాగి చరణ్, కోశాధికారిగా బిట్ల రవి, సాంస్కృతిక కార్యదర్శిగా సత్యనారాయణ గౌడ్, లైబ్రరీ కార్యదర్శిగా బాలరాజు నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు వెంకట రమణ గౌడ్, శైలేష్ దేశముఖ్ తెలిపారు. సీనియర్ న్యాయవాదుల కోటలో భాస్కరరావు, బిర్లా రామారావు, భిక్షపతి కార్యవర్గ సభ్యులుగా, మహిళ ప్రతినిధిగా వరలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

29న అధ్యక్ష పదవి కోసం పోటీ..

బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాదులు కిరణ్ కుమార్ గౌడ్, దేవదాస్ అలాగే సహాయ కార్యదర్శిగా రెంజర్ల సురేష్, మహమ్మద్ అయూబ్ పోటీలో ఉన్నారు. వీరికి ఈ నెల 29 న పోలింగ్ నిర్వహించనున్నారు.

దుకాణాదారుడిపై ఫిర్యాదు

నిజామాబాద్ సిటీ: నగరంలోని కంఠేశ్వర్ ఆలయ పరిధిలోగల 19వ దుకాణం నిర్వాహకుడు మనీష్‌పై ఆలయ చైర్మన్ మహేష్, ఈవో వేణు మూడో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆలయ కమిటీ సిబ్బంది నెల రోజుల క్రితం 19వ నంబర్ దుకాణాన్ని తొలగించారు. అయినా దుకాణాదారుడు అక్రమంగా దుకాణం తెరిచి, ఆలయ సిబ్బందిపై దుర్భాషలాడాడు. దీంతో చైర్మన్, ఈవోలు దుకాణాదారుడిపై 3వ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలో ఇంటర్ పరీక్షల్లో భాగంగా జువాలజీ, హిస్టరీ, మ్యాథ్స్ పరీక్షలు జరిగాయి. శుక్రవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరిగాయి. జిల్లావ్యాప్తంగా 13,500 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 496 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శుక్రవారం డీఐఈవో నాలుగు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

కల్లు కాదు గరళం

- గ్రామాల్లో ఏరులై పారుతున్న కృత్రిమ కల్లు
- ఈత వనాలు లేకుండానే కల్లు విక్రయాలు
- మత్తు పదార్థాలతో తయారీ



మోపాల్(నిజామాబాద్‌రూరల్): గ్రామాల్లో కృత్రిమ కల్లు ఏరులై పారుతోంది. కల్లు దుకాణ నిర్వాహకులు ఈత చెట్లు లేకుండానే మత్తు పదార్థాలతో కల్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. నిత్యం వేల లీటర్ల కల్లు విక్రయిస్తూ రూ.లక్షలు సొమ్ముచేసుకుంటున్నారు. ఆల్ఫ్రాజోలం, డైజోఫాం, కుంకుడు కాయ రసం, తదితర మత్తు పదార్థాలతో కల్లు తయారు చేస్తుండటంతో అది కల్లు కదని, గరళం అని పలువురు పేర్కొంటున్నారు. ఇవేమి తెలియని గ్రామాల్లోని అమాయక ప్రజలు కల్తీ కల్లుకు బానిసలవుతున్నారు.

మతిస్థిమితం కోల్పోతున్న ప్రజలు..

మండలంలోని ఏ ఒక్క గ్రామంలో కూడా కల్లు అమ్ముతున్న మేరకు ఈత వనాలు లేవు. కానీ వేలాది లీటర్ల కృత్రిమ కల్లును తయారు చేసి రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. అక్కడక్కడ కొన్ని ఈత వనాలు మాత్రమే ఉన్నాయి. ఆల్ఫ్రాజోలం, డైజోఫాం వంటి మత్తుపదార్థాలకు తోడు నురుగు కోసం కుంకుడు కాయల రసంతో కల్లు తయారు చేస్తున్నారు. ఇలాంటి కల్లుకు బానిసలైన ప్రజలు, కల్లు లేకుంటే మానసిక స్థితిని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. అంటే మత్తు పదార్థాలను ఏమేరకు వినియోగిస్తున్నారో అర్థంచేసుకోవచ్చు.

చూసీచూడనట్లుగా అధికారులు..

మండలంలో 21 గ్రామపంచాయతీలు ఉండగా, అందులో 8 గిరిజన తండాలు ఉన్నాయి. గతంలో మండలానికి అవసరమైన కల్లును డిపోలో తయారు చేసి గ్రామాలకు సరఫరా చేసేవారు. కానీ మూడేళ్లుగా ప్రతి గ్రామంలోని డిపోల్లోనే కల్లు తయారీని కొనసాగిస్తున్నారు. కృత్రిమంగా కల్లును తయారు చేసి విక్రయిస్తున్నా.. ఎక్సైజ్, పోలీస్ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీనికితోడు వీడీసీలకు ప్రతినెలా మామూళ్లు చెల్లిస్తుండటంతో వారు కూడా పట్టించుకోవడంలేదు. వీడీసీలకు ఏడాదికి రూ.6 లక్షల నుంచి రూ.10లక్షల వరకు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేగాకుండా కల్లు సీసా ధర ఇష్టారీతిన పెంచుకుంటూ ప్రజల నెత్తిన భారాలు వేస్తున్నారు. సీసా ధర రూ.10లకుపైనే ఉంది. బోర్గాం (పి) నుంచి మంచిప్ప వరకు, కులాస్‌పూర్ నుంచి న్యాల్‌కల్ వరకు అన్ని గ్రామాల్లో పోటీ పడి కృత్రిమ కల్లు తయారు చేస్తున్నారు. అధికారులు తూతూ మంత్రంగా దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కాగా ఇదేవిషయమై ఎక్సైజ్‌శాఖ అధికారుల వివరణ కోరగా, ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు.

కేసీఆర్ పాలనపై తప్పుడు ప్రచారం సరికాదు



బాల్కొండలో మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

- రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి
- బాల్కొండలో బీఆర్‌ఎస్ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనం

బాల్కొండ: చేయి, పువ్వు గుర్తు సన్నాసులు సీఎం కేసీఆర్ పాలనపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంకే ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొని, మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం నిత్యం కృషి చేస్తున్నారన్నారు. కానీ కాంగ్రెస్, బీజేపీ నాయకులు పనిగట్టుకుని తప్పుడుప్రచారం చేస్తున్నారన్నారు. నిజామబాద్ ఎంపీ అర్వింద్ బాండ్ పేపర్‌కు విలువ లేకుండ చేశాడని ఆరోపించారు. జిల్లా ప్రజలకు, రైతులకు మాయ మాటలు చెప్పి ఎన్నికల్లో గెలిచాడన్నారు. సమావేశంలో పాల్గొన్న శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్ మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. నాయకులు బద్దం ప్రవీణ్‌రెడ్డి, కోటపాటి నరసింహనాయుడు, మధు శేఖర్ పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ బాధ్యులను శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ కారకులను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్‌సీ కార్యాలయం నుంచి పెన్‌డ్రైవ్ ద్వారా పేపర్లను కాపీ చేసుకోవడం అంత ఆశామాషీ కాదన్నారు. దీనికి చైర్మన్ జనార్దన్‌రెడ్డి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మంత్రివర్గం నుంచి ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలన్నారు. సీఎం కేసీఆర్ కుటుంబం చేస్తున్న అవినీతి అక్రమాలను ప్రశ్నించే జర్నలిస్టులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై సమాజం నివ్వెరపోతుందన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. షాడో మేయర్‌గా మేయర్ భర్త వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని, ఎమ్మెల్యే కనుసన్నల్లోనే అధికారులు పని చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ పేదల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన నిరుద్యోగ మహాధర్నాకు జిల్లా నుంచి తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. నాయకులు స్వామి యాదవ్, నారాయణ యాదవ్, యెండల సుధాకర్, శ్రీనివాస్ శర్మ, గంగాధర్, మీసేవ శ్రీనివాస్, రషీద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: నగరంలో శుక్రవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు 'పోషణ పక్షం' గోడ పత్రులను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 3వరకు పోషణ పక్షం నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీల్లో చిరు ధాన్యాలపై అవగాహన కల్పించడంతో పాటు రక్తహీనత తగ్గించడానికి కృషి చేయాలన్నారు. మహిళ సంక్షేమ శాఖ పీడీ సుధారాణి, సూపరింటెండెంట్ ఇంద్ర, సీడీపీవో సౌందర్య, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- మోస్రాలో మండల సమావేశం



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

రుద్రూర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, ప్రజాప్రతినిధులు, నాయకులు దగ్గరుండి పనులు సక్రమంగా చేయించాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మోస్రాలో శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం పిట్ల ఉమా అధ్యక్షతన ఏర్పాటు చేశారు. సమావేశానికి హాజరైన స్పీకర్ పోచారం వివిధ శాఖల పనితీరును తెలుసుకున్నారు. నిధులు మంజూరైన పనులు మూడు నెలల్లో పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అవాంతరాలు అధిగమించి ప్రతి ఇంటింటికి మంచి నీరు అందించాలని అధికారులకు సూచించారు. 952 సర్వే నంబర్‌లో ఉన్న 740 ఎకరాల భూమి సమస్యను ఫారెస్ట్, రెవెన్యూశాఖ అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. ఉమ్మడి మండలంలో వరి కోతలు ప్రారంభమవుతున్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మద్దతు ధర కన్న తక్కువ విక్రయించకుండా రైతులను చైతన్యం చేయాలన్నారు. రైతులు పంట పొలాలకు వేసుకునే రోడ్లకు నిధులు మంజూరు చేస్తానని వెల్లడించారు. పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు రూ. ఐదు లక్షల స్కీం క్లోజ్ అయిందని, త్వరలో రూ.మూడు లక్షల స్కీం రాబోతుందన్నారు. ఇళ్లు నిర్మించుకునే అర్హులైన వారి వివరాలు స్థానిక ప్రజాప్రతినిధులు సేకరించాలని సూచించారు. ఇప్పటికే బాన్సువాడ నియోజకవర్గంలో 11వేల ఇళ్లు మంజూరు చేశామన్నారు. బాన్సువాడ సెగ్మెంట్‌లో అందరికి సొంత ఇళ్లు ఉంటాయన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికి పక్కా ఇళ్లు ఉండాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల ద్వారా వినతులు స్వీకరించారు. మోస్రా మండలంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు విడుదలైన బిల్లులను స్పీకర్ పంపిణీ చేశారు. జెడ్పీటీసీ విజయభాస్కర్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల అభివృద్ధికి చేయూత



బండ ప్రకాశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

భిక్కనూరు: ముదిరాజుల అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం చేయూతను అందిస్తోందని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ అన్నారు. మండలంలోని జంగంపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన పెద్దమ్మ ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ముదిరాజ్ సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో ముదిరాజు కులస్తులు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని ఈ విషయమై ప్రభుత్వం వారి సంక్షేమం కోసం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పున్న రాజేశ్వర్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు విఠల్, సర్పంచ్ తున్కి వేణు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పీపుల్స్ యాత్రకు సంఘీభావం



ఖలీల్‌వాడి: హాత్‌సేహాథ్ జోడా యాత్రలో భాగంగా కాంగ్రెస్ శాసనసభ పక్షనేత మల్లు భట్టి విక్రమార్క్ చేపట్టిన పీపుల్స్‌యాత్రకు శుక్రవారం ఆసిఫాబాద్‌లో నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తాహెర్ బిన్‌హుందాన్, రాష్ట్ర కిసాన్ కేత్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఆసిఫాబాద్‌లో మల్లు భట్టి విక్రమార్కతో పాదయాత్ర చేశారు. యాత్రలో గిరిజనుల పోడుపట్టాలు, ధరణి సమస్యలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లతోపాటు ఇతర సమస్యలను మల్లు దృష్టి తీసుకువచ్చారని ఆయన తెలిపారు. నాయకులు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని నిరసన



కామారెడ్డిలో ట్రెజరీ జిల్లా అధికారికి వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కామారెడ్డి అర్బన్: ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న ఉపాధ్యాయులకు రావాల్సిన బిల్లులు చెల్లించకపోవడంపై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా ట్రెజరీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. డీటీఎఫ్, టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్ స్టీరింగ్ కమిటీ జిల్లా నాయకులు ఎస్‌సీ ప్రభాకర్, దేవులా, సాయిలు, అనిల్‌కుమార్ మాట్లాడారు. ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిన మూడు నెలలుగా ఎయిడెడ్ టీచర్లకు వేతనాలు అందడం లేదని, సప్లిమెంటరీ వేతనాలు, సెలవు జీతాలు, జీపీఎఫ్ క్లెయిమ్‌లు, పీఆర్సీ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారుఎ. అనంతరం ట్రెజరీ జిల్లా అధికారి సాయిబాబుకు వినతి పత్రం అందజేశారు. 28లోగా హైదరాబాద్‌లో మహాధర్నా చేస్తామని హెచ్చరించారు. బాపురావు, గఫూర్, గంగారాం, గణేష్, సరోజినీ, నళిని, లక్ష్మి, బస్వయ్యఉన్నారు.

సుభాష్‌నగర్: పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ప్రతినిధులు డిమాండ్ చేశారు. యూఎస్‌పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్, ట్రెజరీ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం డీటీఓకు అందజేశారు. నాయకులు విజయ్‌కుమార్, రమేష్, బాలయ్య, రాజన్న, సత్యనారాయణ, వెంకట రమణ, గంగాధర్, సాయన్న, రాజారాం, సిరాజ్, రాజేశ్వర్, సురేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న యూఎస్‌పీసీ నాయకులు

అథ్లెటిక్స్‌లో ఎక్సైజ్ కానిస్టేబుల్ ప్రతిభ



ఖలీల్‌వాడి: అఖిల భారత సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ పోటీల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ చంద్రమోహన్ రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. ఈ నెల 26 నుంచి 28 వరకు పూణేలో జరిగే అఖిల భారత సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్ పోటీలలో చంద్రమోహన్ పాల్గొంటారు. ఈ పోటీలో పాల్గొనేందుకు వెళ్తున్న ఆయనను ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, ఎక్సైజ్ అసోసియేషన్ నాయకులు సన్మానించి రూ.5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ యూనియన్ అధ్యక్షుడు రవికుమార్, రాజేశ్వర్, సుదర్శన్, భోజన్న, ఉత్తమ్, మంజుల, సంజయ్, సురేష్, దీపక్ పాల్గొన్నారు.

పెళ్లికావడం లేదని యువకుడి ఆత్మహత్య

మాచారెడ్డి: పెళ్లి కావడం లేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని రత్నగిరిపల్లిలో చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై సంతోష్ కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బత్తుల మధు(26) కొన్నేళ్లుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నాడు. అయినా పెళ్లి కుదరక పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. చేను వద్దకు వెళ్లి వస్తానని చెప్పిన మధు అక్కడే చెట్టుకు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడికి తల్లిదండ్రులు, సోదరుడు ఉన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మోపాల్(నిజామాబాద్ రూరల్): మండలంలోని న్యాల్‌కల్‌లోగల మాసాని చెరువులో గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహం (45) స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మహేష్ శుక్రవారం తెలిపారు. మృతుడు ఒకటి, రెండ్రోజుల క్రితమే చెరువులో పడి ఉండొచ్చని, మృతుడు తెల్ల బనియన్ ధరించినాడన్నారు. గ్రామస్తుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించామని తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 8712659850 (ఎస్‌ఐ), 87126 59847 (సీఐ)ను సంప్రదించాలని ఎస్‌ఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్నామని తెలిపారు.

బెహరాన్‌లో పడకల్ వాసి గుండెపోటుతో మృతి



శ్రీనివాస్ (ఫైల్)

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన యాటకర్ల శ్రీనివాస్(55) అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. బతుకుదెరువు కోసం ఏడాది క్రితం శ్రీనివాస్ బెహరాన్‌కు వెళ్లాడు. అక్కడ కంపెనీలో పని చేస్తుండగా ఈ నెల 21న గుండెపోటు రావడంతో శ్రీనివాస్ మృతి చెందాడని బంధువుల ద్వారా ఇంటికి సమచారం అందించారు. శ్రీనివాస్ బెహరాన్ వెళ్లి ఆర్థికంగా ఎదగాలని అనుకున్నాడు. కానీ విధి వక్రీకరించడంతో గుండెపోటుతో మరణించాడు. మృతుడికి భార్య కళావతి, కుమారుడు ప్రవీణ్, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబీకులు మృతదేహం కోసం ఎదురు చూస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి బైపాస్ చౌరస్తా వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని, ఒకరు మృతిచెందారు. వివరాలు ఇలా.. హైదరాబాద్‌కు చెందిన మురుగేష్ (40) కూలిపని చేస్తూ జీవించేవాడు. ఈనెల 27న జక్రాన్‌పల్లిలోని వాళ్ల అత్తమ్మ వారి ఇంట్లో జరిగే మారపండుగ కోసం అతడు నాలుగు రోజుల క్రితం వచ్చాడు. శుక్రవారం మురుగేష్ తమ బంధువులతో కలిసి బైక్‌పై గోవింద్‌పేట్ గ్రామంలో పనికి బయలుదేరాడు. మామిడిపల్లి బైపాస్ చౌరస్తా రాగానే గుర్తు తెలియని వాహనం అతడిని వెనుక నుంచి ఢీకొనడంతో మురుగేష్ మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో మేకలు ..

రెంజల్(బోధన్): మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి ఊర కుక్కలు దాడి చేయగా జంలం రవికి చెందిన 5 మేకలు మృతిచెందగా మరో రెండు తీవ్రంగా గాయపడ్డాయి. ఇంటి ముందు గల షెడ్డులో ఉన్న మేకల మందపై కుక్కలు దాడి చేసి పీక్కుతిన్నట్లు స్థానికులు పేర్కొన్నారు. షెడ్డులోనే 5 మేకలు మృతిచెందగా మరో రెండు కొన ఊపిరితో ఉన్నాయని బాధిత కుటుంబీకులు తెలిపారు. మృతిచెందిన ఒక్కో మేక విలువ రూ.8 నుంచి రూ.9వేల వరకు ఉంటాయని వివరించాడు.

ఒకరి అదృశ్యం



దూదేకుల మౌలానా (ఫైల్)

కామారెడ్డి క్రైం: లింగంపేట మండలం మోతె గ్రామానికి చెందిన దూదేకుల మౌలానా(29) అదృశ్యమైనట్లు ఫిర్యాదు వచ్చిందని దేవునిపల్లి ఎస్సై బాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. మౌలానా కొద్ది రోజులుగా కామారెడ్డిలోని బీడీ వర్కర్స్ కాలనీలోని బంధువుల ఇంట్లో ఉంటూ మేస్త్రీ పనికి వెళ్లేవాడు. గురువారం ఉదయం పనికి వెళ్లిన అతడు తిరిగి రాలేదు. అతడి బంధువులు శుక్రవారం చాలా చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో అతడి తండ్రి యూసుఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోపాల్‌లో ఒకరు..



జగదీష్ (ఫైల్)

మోపాల్: మండల కేంద్రానికి చెందిన గాజుల జగదీష్ అదృశ్యమైనట్లు ఎస్సై మహేష్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. మోపాల్‌కు చెందిన జగదీష్ కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల భార్యతో గొడవ జరగడంతో ఈనెల 21న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి అతడి కుటుంబసభ్యులు ఎంతవెతికిన అతడి ఆచూకీ లభించలేదు. అతడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం



ధర్పల్లి (ఇందల్వాయి): ఇందల్వాయి మండలం అన్సాన్‌పల్లి గ్రామ శివారులోని పొలాల వద్ద గల ఆరు ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. అలాగే అందులోని ఆయిల్, కాపర్ వైర్ చోరీ చేశారు. శుక్రవారం రైతుల సమాచారం మేరకు ట్రాన్స్‌కో ఏఈ కేఎస్‌ఆర్ మూర్తి ఘటన స్థలాలకు వెళ్లి, పరిశీలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ తెలిపారు. విద్యుత్ అధికారులు త్వరితగతిన ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలని రైతులు కోరారు.

ఒకరి రిమాండ్



రెంజల్(బోధన్): మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన నగేశ్ అనే యువకుడిని పట్టుకుని శుక్రవారం రిమాండ్ చేసినట్లు ఎస్సై పండ్ల సాయన్న తెలిపారు. గతంలో జరిగిన దొంగతనాల్లో అనుమానితుడిగా ఉండటంతో గురువారం రాత్రి దండిగుట్ట వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతని వద్ద ద్విచక్ర వాహనం, 15 తులాల వెండి, అరతులం బంగారం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.